


# విధి

**తిప్పావఝుల సుబ్రహ్మణ్యం**

**"మీ ఫ్రెండు రావుగారట. ఇంతకు ముందు వచ్చి వెళ్ళాడు. అర్జంటుగా మీతో కలిసి రామాయ పట్నం వెళ్ళా లని,. రెండు రోజులు సెలవుపెట్టి రమ్మని, రేపు ఉదయం 8 గంటలకు అత్మకూరు బస్ స్టాండులో వెయిట్ చేస్తూ ఉంటానని చెప్పి వెళ్ళాడు."**

ఆఫీసుకు రాగానే నన్ను పిలి పించి అయిష్టం గానే చెప్పాడు మేనేజరు. "అలాగేసార్! రేపు పూర్తి చేయాల్సిన హైదరాబాదు ఆఫీసు ఫైలు విషయం ఈ రోజే పూర్తిచేసి మీకప్పగిస్తాను. రెండు రోజులు సెలవు మంజూరుకు అప్లికేషన్ పెడ్తాను" అంటూ నా సీట్లోకి పోయి నా పనిలో నిమగ్నమయ్యాను.

తర్వాత ఉదయాన్నే నెల్లూలోని ఆత్మ కూరు బస్టాండులో రావును కసుకున్నాను. ఇద్దరం రామాయపట్నం బస్సు ఎక్కాం. బస్సులో వాడి తల్లిదండ్రులు వాడికి పెళ్ళి చేయాలని నిర్ణయించుకోవడం వారు చూసిన సంబంధం నాకు అక్కర లేదని వీడు చెప్పడం, డిగ్రీ చదువుతున్నప్పుడు సుప్రజతో తన

పరిచయం, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనే తన నిర్ణయాన్ని, ఈ విషయం వారితో మాట్లాడ్డానికే మనం పోతున్నామని, కుటుంబ పరిస్థితులకను గుణంగా తను తీసుకున్న నిర్ణయం గురించి చెప్పుకుపోతున్నాడు.

ఇంతకు మునుపు కూడా నాతో సుప్రజతో తన పెళ్ళి విషయం చెప్పాడు. కాని ఇంత పట్టుదలగా ఆ అమ్మాయి కోసం ఆమె తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి పెళ్ళి విషయం అడుగుతాడని నేను ఊహించలేదు. వాడు కాలేజీలో చదివే రోజుల్లో నేను వెళ్ళినప్పుడు ఒకసారి ఆ అమ్మాయిని పరిచయం చేశాడు. ఆ అమ్మాయి చామనఛాయగా ఉండేది. ఆ అమ్మాయిని వీడు అంతగా ఆకర్షించుటకు ముఖ వర్చస్సు, చలాకీతనం కారణమై ఉంటుంది. బాహ్య సౌందర్యం కంటే అంతః సౌందర్యమే ముఖ్యమని భావించేవాణ్ణి నేను.

రామాయపట్నంలో బస్సు దిగాం. పల్లెటూరు కాబట్టి ఇంటి అడ్రసు తేలిగ్గా కనుక్కున్నాం. పలకరింపులు అనంతరం రావు పెళ్ళి విషయం నేను సుప్రజతో ప్రస్తావించాను. "నాకు ఇష్టమే. మా అమ్మా నాన్నలతో మాట్లాడండి" అని తన సుముఖతను వ్యక్తం చేసింది. ఆ అమ్మాయి తల్లిదండ్రులతో విషయాన్ని ప్రస్తావించాము. రావు వాళ్ళకు వీళ్ళు దూరపు బంధువులే! రామాయపట్నంలో వీళ్ళు చేరాక రాకపోకలు లేవు. వాళ్ళ అమ్మగారు మేము మంచిరోజు చూసుకొని వచ్చి మీ నాన్నగారితో మాట్లాడుతాము అని చెప్పింది. రావు వాళ్ళ నాన్నగారి మనస్తత్వం, ఎలా మాట్లాడవలసింది ముందుగానే వారికి హితబోధ చేశాడు.

రెండు మూడు రోజుల తర్వాత సుప్రజ వాళ్ళ అమ్మ రావు వాళ్ళింటికి వచ్చింది. రావు నాన్నతో చాలాసేపు మాట్లాడింది. వాళ్ళ నాన్న మాత్రం ససేమిరా వీలుకాదని అన్నాడట. ఆ రోజు రావు కూడా ఊళ్ళో లేడు. పెళ్ళి అయినా కాకుండా ఉంటాడు కాని పెళ్ళికి ఒకరికి మేము మాట ఇచ్చాక మాట తప్పే పని లేదు. ఈ విషయం ముందుగా మాకు చెప్పితే వాడికేం పోయింది అని ఘాటుగా చెప్పాడట. ఆమె కూడా చాలా మెత్తబడి "సరే అన్నయ్యా! వాడేదో అమ్మాయిని చేసికొంటానని వచ్చాడు. బంధుత్వం కలిసిపోతుందని అడిగాం. నీ ఇష్టం" అని భారమంతా మా మీద వేసి, తిరిగి వెళ్ళేటప్పుడు నాదగ్గరొచ్చి జరిగిందంతా చెప్పి వాళ్ళ నాన్న కంటే చేసేదేముందని అని బాధపడుతూ వెళ్ళింది.

యదార్థంగా రావుగారి నాన్నగారంటే బంధువులంతా భయపడుతారు. ఆయనది నిర్దాక్షిణ్యంగా మాట్లాడే స్వభావం. ఇంతదూరం వచ్చారే అని సానుభూతి కూడా లేకుండా ఆయన మాట్లాడాడంటే అది ఆయన స్వభావం. ఒక్కగానొక్కకొడుకు, వాడి ఇష్టప్రకారం చేద్దాం అని ఏకోశానా లేదు. సాయంత్రం రావుకు ఈ విషయం చెప్పాను. రావుది అందరినీ ఎదిరించే స్వభావం. కానీ ఎందుకనో ఈ విషయంలో వాడేమీ మాట్లాడలేదు.


రావుగారి నాన్న నిర్ణయం ప్రకారం పెళ్ళి వైభవంగా జరిగిపోయింది. పెళ్ళికి రామాయపట్నం వాళ్ళు వచ్చారు. గతం మర్చి బంధువులతో వారూ కలిసిపోయారు.

తర్వాత ఆరు నెలలకు కాబోలు సుప్రజ పెళ్ళి శుభలేఖ వచ్చింది. అబ్బాయి బి.టెక్. తిరుపతిలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. దాదాపు ఇరవై వేల జీతం. ఒక పెళ్ళయిన అక్క, అంత మంచి సంబంధం సుప్రజకు దొరికినందుకు పెళ్ళికి హాజరయిన బంధువులంతా ఎంతో సంతోషించారు. కారణాంతరాల వలన నేను ఆ పెళ్ళికి హాజరు కాలేకపోయాను. మా అమ్మ నాన్నలు వెళ్ళివచ్చారు.

నాలుగు సంవత్సరాల తర్వాత నేను పనిమీద విజయవాడ వెళ్ళాను. గాంధీనగర్‌లో సుప్రజ రిక్షాను పిలుస్తూ కనిపించింది. ప్రెగ్నెన్సీ కాబోలు. డాక్టరు వద్దకు వచ్చినట్లుంది. చేతిలో మందుల చీటి. నన్ను గుర్తుపట్టి అన్నయ్యా బాగున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది. మాటల సందర్భంలో మీ వారు తిరుపతిలో గదా పనిచేసేది? అని అడిగాను. పెళ్ళయిన ఒక సంవత్సరంలో బాబు పుట్టడం, ఏక్సిడెంటులో భర్త చనిపోవడం, తను వద్దన్నా వినకుండా అత్తమామలే విషయం చెప్పి వారికి తెలిసిన విజయవాడలో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న నొక కుర్రాడికిచ్చి పెళ్ళి చేయడం, వాళ్ళు బాబుని వారివద్దే ఉంచుకోవడం, ఆధునిక భావాలతో తనకు కొత్త జీవితాన్ని ప్రసాదించారని, మనఃపూర్తిగా తన్ను వివాహమాడిన భర్త, వారి అన్యోన్య జీవితం గూర్చి చెప్పి, రిక్షా పిలిచి ఎక్కేటప్పుడు వీలైతే ఒక్కసారి మా ఇంటికి వచ్చి పోండి అన్నది. ఈ సారి విజయవాడకు వచ్చినప్పుడు ఖచ్చితంగా వస్తానని చెప్పాను. కానీ నాకు తెలుసు అది కుదరదని.

తను అనుకున్న సంబంధం కుదరక పోవడమేమిటి? తల్లిదండ్రులు దానికంటే మెరుగైన సంబంధం చూసి పెళ్ళి చేస్తే ఆక్సిడెంటులో భర్త చనిపోవడమేమిటి? అత్తామామలే మనుమడిని తమవద్ద ఉంచుకొని ఆదర్శముగా మళ్ళీ వివాహం చేయటమేమిటి? ఎన్నో ఒడిదుడుకులకు లోనై ఇప్పుడు అన్యోన్యంగా దాంపత్య జీవితం గడుపుతున్న సుప్రజను నేను అనుకోకుండా కలుసుకోవడమేమిటి?

కథ చదవడం మాని నావైపు చూశాడు ప్రకాశ్. నేను కథ రాస్తూ మధ్యలో నా స్నేహితులు పిలిస్తే మాట్లాడుతూ అప్పుడే రూమ్‌లోకి వచ్చాను. కథకు ముగింపు ఏమిటి బాబాయ్ అన్నాడు. అంతటితో ముగిద్దామనుకుంటున్నాను అని నేను అనేసరికి కథకు పేరు నేను సూచించనా అన్నాడు. ఏమిటన్నట్లుగా వాడివైపు చూశాను. "విధి" అన్నాడు. అవును వాడు చెప్పింది కరెక్టే. విధిననుసరించి అన్నీ జరుగుతాయి. జీవితంలో అనుకున్నవి జరగవు. అనుకోనివి జరుగుతుంటాయి.



## ముళ్ళ పొద

నా భాషయే ముల్లు
నెత్తురు చిమ్మించే నా
స్పర్శతో
నేలకి తెలియబరుస్తున్నాను,
నేనిక్కడ వున్నానని
నేలకు తెలియదు
ఒకప్పుడు ఈ ముళ్ళన్నీ పూలేనని
నాకొద్దు నన్ను మోసం చేసే
ప్రేమికులు
కవులయితే, ఎడారులు వదిలేసి
పూతోటలలోకి వెళ్ళిపోయారు
ఇక్కడ మిగిలినవి
పూలని నలిపే ఒంటెలు మాత్రం
అరుదైన ప్రతి జల బిందువునించి
నేనొక ముల్లుని వికసింపచేస్తున్నాను
ప్రలోభనాలు లేవు, సీతాకోక
చిలుకలకు
ప్రశంసలు లేవు పక్షిరాజులకు
ఎంత ఎండినా పట్టించుకోని
పచ్చికల పార్శ్వములో
మరో సౌందర్యం సృష్టిస్తున్నాను
వెన్నెలకి అతీతంగా
కలలకు అతీతంగా
పదునైన ఒక సమాంతర భాష

*మళయాల మూలం :*
*కె. సచ్చిదానందన్*
*తెలుగు సేత : ఎల్.ఆర్. స్వామి*